వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేయాలి



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



చుక్కల భూముల పట్టాను రైతుకు అందిస్తున్న దృశ్యం

దువ్వూరు : వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కానాల కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ పథకాల ద్వారా రూ.150 కోట్లు వలంటీర్లచే అందించామన్నారు. ఇద్దరు వలంటీర్లకు సేవా వజ్ర అవార్డులు, ఐదు మందికి సేవారత్న అవార్డులను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ దండు చెంద్రాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చుక్కల భూముల చిక్కులు తప్పించాం

దువ్వూరు : రైతులు ఎదుర్కొంటున్న చుక్కల భూములకు చిక్కులు తప్పించి, రైతులకు పట్టాలిస్తున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కానాల కల్యాణ మండపంలో మంగళవారం చుక్కల భూముల పట్టాలను రఘురామిరెడ్డి రైతులకు అందించారు. మండలంలో 618 మంది రైతుల ఆధీనంలో ఉన్న 1359.55 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ చుక్కల భూముల ఇబ్బందులను తెలుసుకుని వారిని సమస్యను పరిష్కరించాలని నిర్ణయించారని తెలిపారు. దీంతో రైతుల ఆధీనంలో ఉన్న భూములను గుర్తించి వారికి పట్టాలు ఇచ్చామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అధికారుల చుట్టు ఎన్ని సార్లు తిరిగిన చుక్కల భూముల రైతులకు ప్రయోజనం కలగలేదన్నారు. చుక్కల భూముల రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నేడు ఆ ఇబ్బందులు తొలగి ప్రభుత్వం అందించిన పట్టాల ద్వారా రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు పొంది తమ కుటుంబ అవసరాలను తీర్చుకోవచ్చునని పేర్కొన్నారు. రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా పట్టాలు అందించడం సంతోషంగా ఉందన్నారు.

తొలి సంతకంతోనే సంక్షేమానికి శ్రీకారం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి సంతకంతోనే ప్రజా సంక్షేమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం కూరగాయల మార్కెట్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే జగన్ మోహన్‌రెడ్డి తొలి సంతకం చేసి నవరత్నాలతోపాటు ఇతర సంక్షేమ పథకాలనూ అమలు చేశారన్నారు. జీవితాంతం మనకు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వందల కిలోమీటర్లు ప్రజా సంకల్పయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను తెలుసుకున్న జగన్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను హిందువులకు భగవద్గీతలా, ముస్లింలకు ఖురాన్‌లా, క్రైస్తవులకు బైబిల్‌లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ భావించిందన్నారు. మేనిఫెస్టో ప్రకారం పథకాలను అమలు చేశారని తెలిపారు. 2014 ఎన్నికల్లో అనుభవంగల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మేనిఫెస్టోలో 600 హామీలను ప్రకటించి అమలు చేయకుండా వదిలేశారన్నారు. రైతులను, డ్వాక్రా మహిళలను అందరినీ మోసం చేశారని తెలిపారు. ప్రజలెవరూ చంద్రబాబును నమ్మొద్దని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ, ముస్లిం మైనారిటీలకు పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ వెలవలి నారాయణరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, రాయపురెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మార్కెట్ వ్యాపారులు ఖాసీం, దాదాపీర్, జాఫర్, యఖీన్‌వలి, షబ్బీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కందిమల్లాయ్యపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని కందిమల్లాయ్యపల్లెలో పురాతన సీతారాముల దేవాలయాన్ని నూతనంగా పునరద్ధరణ చేసి విగ్రహ ప్రతిష్టను బుధవారం ఏర్పాటు చేయనున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మే 27 నుంచి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు రోజులపాటు గ్రామంలో ప్రత్యేక పూజలు జరిపారు. అదే విధంగా మండలంలోని డి.నేలటూరు పంచాయతీ గోపిరెడ్డిపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టనున్నారు.

అందుబాటులోకి యూరియా

గోపవరం : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఇఫ్‌కోనానో యూరియా అందుబాటులో ఉంచనున్నట్లు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. నానో యూరియాను అన్ని పంటలపై ఉపయోగించుకోవచ్చని, దీంతో ఖర్చు తక్కువ, అధిక దిగుబడి ఉంటుందన్నారు. అలాగే 500 ఎంఎల్ బాటిల్ ధర రూ.240లు ఉంటుందన్నారు. అలాగే డ్రిప్, స్ప్రింకర్లు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో హోంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల అధ్యక్షురాలు బిజివేములరమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సి.రామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులతో పాటు ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

వీల్ చైర్ వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అమృతానగర్‌కు చెందిన దివ్యాంగుడు షరీఫ్‌కు వీల్ చైర్‌ను అందించారు. మంచానికే పరిమితమైన షరీఫ్‌కు దాతల సహాయంతో వీల్ చైర్‌ను అందించామని సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ తెలిపారు.

2న ప్రోత్సాహక బహుమతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభకనబరిచిన గాండ్ల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.నాగయ్య తెలిపారు. గురువారం ఆంధ్రకేసరి రోడ్డులోని గాండ్ల సంఘం భవనంలో జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదివే గాండ్ల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన గోపీచంద్

అట్లూరు : మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది ఏళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొండూరు ఎస్సీ కాలనీకి చెందిన వరికుంట గోపాలయ్య కుమారుడు గోపీచంద్(9) కిరాణాషాపు దగ్గర నిల్చొని ఉండగా బద్వేలు వైపు నుంచి ద్విచక్రవాహనంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బాలుడిని ఢీకొని ఆపకుండా వేగంగా వెళ్లి పోయాడు. గాయపడిన బాలుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

3న అరుణాచలానికి బస్సు సర్వీసు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి జూన్ 3వ తేదీన ఉదయం 7 గంటలకు అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఉదయం బయల్దేరే బస్సు మధ్యాహ్నం కాణిపాకంలో వరసిద్ధి వినాయకుడి దర్శనం అనంతరం గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు వెళుతుందన్నారు. బస్సు టికెట్ ధర రానుపోను రూ.1450లుగా నిర్ణయించామన్నారు. వివరాలకు నంబర్ 9966525210, లేదా ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్‌లో చూడాలని కోరారు.

పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకోండి

కలసపాడు : మండలంలోని రైతులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరానికి పండ్ల మొక్కల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఏపీఓ రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్లతోటలు (మామిడి, నిమ్మ, చీనీనిమ్మ, జామ, సపోట) వంటి మొక్కలు నాటడానికి, మునగ మొక్కలు పెంచుకునేందుకు ఆసక్తి కలిగిన చిన్న, సన్నకారు కుటుంబానికి చెందిన (5 ఎకరాల లోపు భూమి) రైతులు సొంత బోరు కలిగి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పత్రాలు (జాబ్‌కార్డు, రేషన్‌కార్డు, 1బి నకలు, ఆధార్‌కార్డు, తహసీల్దారు ద్వారా జారీ చేసిన చిన్న, సన్నకారు సర్టిఫికెట్, పట్టాదారు పాసుపుస్తకం) తో కలసపాడు ఉపాధి కార్యాలయంలో జూన్ 3వ తేదీలోపు సంప్రదించాలని తెలిపారు.

అనుమతులు లేని లేఅవుట్లకు నోటీసులు జారీ



అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌కు నోటీసులు అంటిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు

గోపవరం : మండలంలోని గోపవరం, బేతాయపల్లె గ్రామ పంచాయతీల పరిధిలో అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లకు మంగళవారం గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. 'అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలేవి?' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు అనుమతులు లేని లేఅవుట్లకు నోటీసులు జారీ చేయాలని గ్రామ పంచాయతీలకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు ఈఓపీఆర్‌డీ హసీనా, గోపవరం, బేతాయపల్లె పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డిలు అనుమతులు లేని లేఅవుట్ల వద్దకు వెళ్లి నోటీసులు అంటించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు అందజేశారు. అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారి అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లలో రోడ్లు వేసి ప్లాట్లు వేయడం, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఆ పనులను నిలిపివేయాలని నోటీసుల ద్వారా తెలియపరిచారు. నోటీసులు జారీ చేసిన 15 రోజుల్లోపు లేఅవుట్లలో చేపట్టిన పనులను తొలగించుకోవాలని, లేనిపక్షంలో అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రాచమల్లు సహకారాన్ని మరువలేం

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అందించిన సహకారాన్ని, ప్రోత్సాహాన్ని తాము మరువలేమని జైత్ర సినిమా హీరో సన్నీ నవీన్, హీరోయిన్ రోహిణి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మంగళవారం స్థానిక రాస్తా రెస్టారెంట్‌లో జైత్ర యూనిట్ టీం సభ్యులకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేకు రాయలసీమపై ప్రత్యేక అభిమానం ఉందని తెలిపారు. డైరెక్టర్ తోట మల్లికార్జున, కో డైరెక్టర్ ధనుంజయ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పండ్ల తోటల పెంపకం

ప్రొద్దుటూరు : ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సబ్సిడీపై పండ్ల తోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జగదీశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కానపల్లె గ్రామ సమీపంలో పంట పొలాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ కూలీలతో ఆయన మాట్లాడుతూ ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ప్రతి కూలి కనీసం 4 గంటలు పని చేయాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే ఒక్కొక్క కూలికి రోజు వేతనం రూ.270 వరకు వస్తుందని, కానీ కానపల్లె గ్రామ కూలీలు కేవలం రెండు గంటలు మాత్రమే పని చేసి తక్కువ కూలి తీసుకుంటున్నారన్నారు. కనీసం 4 గంటలు పనిచేయకపోతే తాను పని వద్దకు వచ్చి మస్టర్‌ను నమోదు చేయనని హెచ్చరించారు. ఆసక్తిగల రైతులు పండ్ల తోటల పెంపకం కోసం సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం, జాబ్‌కార్డు అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

పోరుమామిళ్ల : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఇక్కడి జీబీ నగర్ కాలనీలో ఆ సంస్థ నేతలు జండా ఎగురవేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ మాట్లాడుతూ 53 సంవత్సరాలుగా సీఐటీయూ కార్మికుల పక్షాన నిలబడి రాజీ లేని పోరాటాలు చేస్తోందన్నారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్ జెండాను ఆవిష్కరించారు. యూనియన్ పట్టణ కార్యదర్శి సాల్మన్, ఓబులేసు, రవికుమార్, సుబ్బయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



తుమ్మలపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సమర్థవంతంగా పాలించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. మంగళవారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుండి పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థను, వలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి రూ.లక్షకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మేస్థితిలో లేరని, చంద్రబాబు మాటలు నమ్మవద్దని, ఇలాంటి మోసపూరిత మాటలను నమ్మవద్దని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు యోగానందరెడ్డి, శేషారెడ్డి, జయరామిరెడ్డి, కేశవరెడ్డి, రామిరెడ్డి, నరసయ్య, నాగిరెడ్డి, పోలిరెడ్డి, వీరకుమార్, సుబ్బారెడ్డి, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'మేమే టీడీపీకి రాజీనామా చేస్తున్నాం'



మాట్లాడుతున్న 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి

ప్రొద్దుటూరు క్రైం : తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు 33వ వార్డు కౌన్సిలర్ శివజ్యోతి వెల్లడించారు. మంగళవారం ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులోని వారి కార్యాలయంలో శివజ్యోతి విలేకరులతో మాట్లాడారు. ఏ కారణం చేత తనను, తన భర్త కుతుబుద్దీన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారో టీడీపీ నాయకులు చెప్పాలన్నారు. నిబంధనల ప్రకారం తమకు ముందుగా షోకాజ్ నోటీసు ఇవ్వాలని, తమ వివరణ తీసుకున్న తర్వాతనే సస్పెండ్ చేయాలని చెప్పారు. తాము పార్టీకి కష్టపడి సేవ చేస్తున్నామని, ఎలాంటి తప్పు చేయలేదన్నారు. అయినా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరించి సస్పెండ్ చేయించారన్నారు. వారు సస్పెండ్ చేశారో తెలియదని, తాము మాత్రం ఇప్పుడు టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు కౌన్సిలర్ శివజ్యోతి, ఆమె అనుచరులు ప్రకటించారు. ప్రొద్దుటూరులో 40 వార్డుల్లో టీడీపీ ఓడిపోయిందని, అయితే తాను మాత్రం 33వ వార్డులో గెలిచి టీడీపీ పరువును నిలబెట్టినట్లు చెప్పారు. తన భర్త కుతుబుద్దీన్ ఏ పార్టీలో ఉన్నా కార్మిక నేతగా పని చేశారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలే పార్టీకి వెన్నెముక అని చెప్పుకునే టీడీపీ అధినాయకత్వం ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా కౌన్సిలర్‌ను సస్పెండ్ చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కుతుబుద్దీన్, అనుచరులు పాల్గొన్నారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న మహిళా సంరక్షణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్, భావనారాయణనగర్, అబ్బరాతివీధి సచివాలయాలలో మహిళా సంరక్షణ కార్యదర్శులుగా (మహిళా పోలీస్) గా పనిచేస్తున్న గంపావెంకటసుబ్బమ్మ, వసుధ, సుమనలు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సచివాలయాల పరిధిలో బాల్యవివాహాలను అరికట్టడంలో, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో అందించిన సేవలను గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేసినట్లు వారు తెలిపారు. రాబోవు రోజుల్లో మరింత అంకితభావంతో పనిచేసి స్ఫూర్తిగా నిలవాలని ఎస్పీ కోరినట్లు వారు తెలిపారు.

బుడ్డా వెంగళరెడ్డికి బాల్యం నుంచే దాతృత్వగుణం



బుడ్డా వెంగళరెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు : బుడ్డా వెంగళరెడ్డికి బాల్యం నుంచే దాతృత్వ గుణం ఉండేదని రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైవీ స్వరూప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుడ్డా వెంగళరెడ్డి 201వ జయంతి సందర్భంగా మంగళవారం కొర్రపాడు రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ డొక్కల కరువు వచ్చినప్పుడు పూర్వం వేలాది మంది ప్రజలకు మూడు పూటల గంజి పోసి బతికించిన గొప్ప మానవతా మూర్తి అని కొనియాడారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, అరసం జిల్లా అధ్యక్షుడు నాగులాపు విజయసారథి, ముడిమెల కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూతూరు వెంకటరామిరెడ్డి, కోశాధికారి కోటా ఓబుళరెడ్డితోపాటు కార్యవర్గ సభ్యులు యడవల్లి రమణయ్య, వెంకటశివారెడ్డి, పద్మ వీరన్న, మల్లికార్జున, రామాంజులరెడ్డి, ఏరువ లక్ష్మిరెడ్డి, సిరియపు జనార్దన్‌రెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేసింది వైఎస్సార్ సీపీయే



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది వైఎస్సార్ సీపీయేనని బల్లగుద్ది చెబుతామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి గురించి చెప్పుకోవడం నారా లోకేష్ యువగళం పాదయాత్రను అడ్డుకోవడం ఎలా అవుతుందని టీడీపీ నేతలను ఆయన ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేసిన విమర్శలపై ఘాటుగా స్పందించారు. 2014–19 టీడీపీ పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమి లేదని తెలిపారు. గత నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ఆధారాలతో ప్రజలకు, నారా లోకేష్‌కు వివరించే ప్రయత్నం చేస్తే పాదయాత్రను అడ్డుకోవడమంటారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా ప్రచారం చేసుకునే హక్కు ఉంటుందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగానే ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నేతృత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేశామన్నారు. నిజంగా టీడీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే గత ఐదేళ్ల టీడీపీ పాలనలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఆయన సవాల్ విసిరారు. సమావేశంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ నేడు

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వైద్య,ఆరోగ్య విధానంలో భాగంగా మండలంలోని నక్కలదిన్నెలో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ మేరకు గ్రామ సమీపంలో బుధవారం ఆసుపత్రి నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. 1.12 ఎకరాలలో రూ.2.50 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించనున్నట్లు ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధికారులతో కలసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఉపాధి కూలీలతో పరిశుభ్రత కార్యక్రమం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజర్ వెంకటరమణారెడ్డి, సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ మంగళవారం లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉపాధి కూలీలతో, సిబ్బందితో కలసి పనులు చేశారు. కాలువకట్ట, ఇందిరానగర్ ఉపాధి కూలీలు చేస్తున్న పనుల వద్ద పరిసరాల పరిశుభ్రత గురించి వివరించి ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు, చెత్త ఏరి కుప్పగా వేసి తగుల బెట్టారు. పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు అందరి సహకారం అవసరమని రేంజర్ తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ నిరోధానికి అందరూ కృషి చేయాలన్నారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది కరునాకర్, వెంకటేష్, కిశోర్‌కుమార్‌రెడ్డి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. జిరాఫీ చెస్ కోచ్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యారంబోర్డు, జిరాఫీ చెస్, లూడో, షెటిల్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీల వల్ల విద్యార్థులకు పట్టుదల, చురుకుదనం, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. యోగా టీచర్ వెంకటసుబ్బమ్మ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, చెస్ కోచ్‌లు అరవింద్, తేజస్, రెహ్మాన్‌ఖాన్, శారద పాల్గొన్నారు.

వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ వెంకటేశ్వర్లు

రాజుపాళెం : పాడి రైతులు వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని రాజుపాళెం, పెద్దముడియం మండలాల పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలోని పశువైద్యశాలలో మంగళవారం వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులు 50 శాతం వాటా చెల్లించాలని చెప్పారు. ఈ పథకం గరిష్ఠంగా ఒక కుటుంబంలో 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు పశు బీమా చేసుకొనే అవకాశం ఉంటుందన్నారు. మూడేళ్లకు గాను బీపీఎల్, ఎస్సీ, ఎస్టీ వారైతే రూ.30 వేల బీమాకు రూ.384, ఏపీఎల్ వారైతే రూ.960లు చెల్లించాలని సూచించారు. ఏడాదికి గొర్రె, మేకలకు ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారైతే రూ.6 వేలకు రూ.36, రెండు సంవత్సరాలైతే రూ.54, మూడు సంవత్సరాలైతే రూ.75 చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కోసం గ్రామంలోని పశువైద్యశాలలో సంప్రదించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కొర్రపాడు పశు వైద్యురాలు లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలతో పోరుమామిళ్ల క్రీడాకారులు

పోరుమామిళ్ల : ఈనెల 27, 28 తేదీల్లో తాడిపత్రిలో జరిగిన మొదటి రాయలసీమ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు సత్తా చాటి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సబ్‌జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్, పూంసే విభాగాల్లో రాణించి పతకాలు కైవశం చేసుకున్నారన్నారు. తస్విక, కావ్య, సాజిద్, అబూబకర్, చైతన్య, ఖాశిం, నయీం, అమర్‌నాథ్, తస్లీం, రేష్మ, సాయిప్రీతి, సుభాష్, మహమ్మద్ అనీస్ బంగారు పతకాలు సాధించారన్నారు. సంగా భవ్య సీనియర్, పూంసే విభాగాల్లో బంగారు పతకాలు సాధించి పోరుమామిళ్లకు గర్వకారణంగా నిలిచిందన్నారు. హరిణి, మోహిని, మైత్రి, భూమిజ, ప్రణవి, జావస్, పునీత్, మోక్షిత్, నాదేష్, శివసాత్విక్, సుమంత్, విజయకుమార్, రజత పతకాలు సాధించారన్నారు. సుమంత్ కూడా రెండు విభాగాల్లో రజత పతకాలు సాధించారన్నారు. ఖాజా, చేతన్, శ్రీనిజ్, హృతిక్, ఫయాజ్‌బాష కాంస్య పతకాలు సాధించారన్నారు.